# సింగిల్ పేజీ కథలు

## అనుకోని మార్పు

"వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. డిష్ వాషర్ పెట్టడం దగ్గర్నుంచి బాబుకి డైపరు మార్చడం వరకు అన్ని పనుల్లో మీ ఆవిడకు సాయం చేస్తున్నావు. నీకు నామోషీగా ఉండదా సత్యం?" అడిగాడు రాజా తన మిత్రుడు సత్యమూర్తిని.

"నా ఇంటి పని నేను చేసుకోవటానికి నామోషీ ఎందుకు పడాలి రాజా?"

"అవన్నీ ఆడవాళ్లు చేయవలసిన పనులు కదా!"

"ఆడవాళ్ల జీవితాలు ఇంటికే పరిమితమై ఉన్న కాలంలో అవన్నీ ఆడవాళ్ల డ్యూటీలయి ఉండవచ్చు. కానీ ఇప్పటి ఆడపిల్లలు బాగా చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నారు. అలాంటి వాళ్లనే మనం ఇష్టపడి పెళ్లి చేసుకుంటున్నాం. కష్టపడి పనిచేసి ఇల్లు చేరే వేళకు వాళ్లు కూడా మనలాగే అలసిపోయి ఉంటారు. అంచేత సాయం చేయవలసిన డ్యూటీ మనకు ఉంటుంది కదా! పంచుకోవటం వల్ల పనులు తొందరగా తెములుతున్నాయి. తగినంత విశ్రాంతి ఉండి ఉద్యోగాలు బాగా చేయగలుగుతున్నాం" అన్నాడు సత్యమూర్తి.

"వెనకాల పడి పనులు చేస్తూ ఉంటే ఆడది మగాడిని లోకువ కట్టెయ్యదూ?"

"ఇంగితం ఉన్న ఏ ఆడపిల్లా భర్తను లోకువగా చూడదు రాజా! పైగా తనకు అన్ని విధాల సహాయంగా ఉంటున్న భర్త పట్ల ఆమెకు ప్రేమతో పాటు గౌరవం, కృతజ్ఞతాభావం ఉంటాయి" అన్నాడు సత్యమూర్తి. సత్యమూర్తి మాటలు వింటూ మౌనంగా ఉండిపోయాడు రాజా.

"నీ ప్రశ్నలు వింటూంటే నువ్వు మంజులకు ఏమీ సాయం చేయడం లేదనిపిస్తుంది. నిజమే కదూ?" అని అడిగాడు సత్యమూర్తి.

"అదేం కాదురా! మంజుల నన్నే పనీ ముట్టుకోనివ్వదు. అన్ని పనులు తనే చేసుకుపోతుంది" అన్నాడు రాజా.

"అంటే ఆఫీసు నుంచి వచ్చాక నీ పేరుకు తగ్గట్టు రాజాలాగ దర్జాగా కాలుమీద కాలు వేసుకొని కూర్చుంటున్నావన్నమాట" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ. జవాబుగా తనూ నవ్వేశాడు రాజా.

పెళ్లిచూపుల్లో మంజుల బాగా నచ్చాక పెళ్లి చేసుకొని అమెరికా తీసుకువచ్చాడు రాజా. యూనివర్సిటీలో చదువుతోబాటు ఇంటి పని, వంటపని, షాపింగు అన్నీ ఆమే చూసుకోవాలని కచ్చితంగా చెప్పాడు. మొదట్లో మంజుల ఉత్సాహంగా అన్ని పనులు చకచకా చేసినా కాలం గడుస్తున్నకొద్దీ పని భారం ఎక్కువై అలసిపోతూ ఉండేది.

రాజా తన వస్తువులు, బట్టలు, పుస్తకాలు అన్నిటిని చిందరవందరగా పడేస్తూ ఉండేవాడు. సర్దడంలో ఏమాత్రం ఆలస్యం చేసినా విసుక్కొనేవాడు. అలసటతో ఆదరాబాదరాగా ఆమె చేసిన వంట ఒక్కొక్క రోజు సరిగా కుదిరేది కాదు. రాజా కోపంతో కంచాన్ని విసరికొట్టేవాడు.

"చదువుతో ఎంత బిజీగా ఉంటున్నానో చూస్తున్నావు కదా రాజా! రాగానే ఇల్లంతా సర్ది వంట చేయాలంటే చాలా శ్రమగా ఉంటూంది." అంది మంజుల ఒకరోజు వచ్చాక అలసటగా సోఫాలో వాలి. "అందుకని రాణీగారికి రాగానే కాఫీ అందించి సేవ చేయాలన్నమాట" అన్నాడు రాజా వెటకారంగా. జవాబు చెప్పే ఓపిక కూడా లేక మంజుల మౌనంగా ఉండిపోయింది.

"లోకంలో నువ్వొక్కర్తివే కష్టపడిపోతున్నట్లు మాట్లాడుతున్నావే! చదువులు, ఉద్యోగాలు ఉన్న ఆడవాళ్లు ఇల్లు వాకిలి చక్కబెట్టుకోవటం లేదా?" కోపంతో రెచ్చిపోయాడు రాజా.

"చక్కబెట్టుకోవటం లేదని నేననలేదు. కాకపోతే వాళ్లకు భర్తల సహకారం ఉండి ఉంటుంది" అంది మంజుల.

"అంటే నేను పనివాడి అవతారం ఎత్తాలన్నమాట. అంత లోకువైపోయానా? ఇక్కడికి తీసుకొని వచ్చి పై చదువుకు ప్రోత్సహించినందుకు కృతజ్ఞత చూపకపోగా పొగరుతో, నిర్లక్ష్యంతో నన్ను పనివాడిని చేయాలని చూస్తున్నావు"

"ప్రతి మాటకు పెడర్థాలు తీసి ఇంటిని నరకం చేయకు రాజా" అంది మంజుల విసిగిపోయి.

"శ్రద్ధగా పనిచేయటం లేదన్నంత మాత్రాన నీకు ఇల్లు నరకమైపోయిందా? సరే! ఎవరైనా స్వర్గం చూపించే వాళ్లుంటే వెళ్లు. ఇంక ఒక్క క్షణం కూడా నా ఇంట్లో ఉండవద్దు" అని అరిచాడు. మంజుల స్టన్ అయింది. తనదే తప్పయినట్లు అతన్ని క్షమించమని వేడుకుంటే అతను తనను లోకువకట్టి అణచివేస్తాడని కొంతకాలం దూరంగా ఉంటే పరిస్థితులు మెరుగుపడవచ్చునని భావించింది.

ఇంట్లోంచి పొమ్మనగానే భయపడిపోయి కిమ్మనకుండా అన్ని పనులు చేస్తుందని, అప్పుడింకా అధికారం చలాయించవచ్చునని అనుకున్న రాజా మంజుల తన వస్తువులన్నిటిని సర్దిపెట్టుకొని వెళ్లిపోతూ ఉంటే నివ్వెరపోయి చూస్తూ ఉండిపోయాడు. ఆడది! తనకే అంత పొగరున్నప్పుడు మగాడిని నాకెంత ఉండాలి! అనుకున్నాడు పళ్లు నూరుకుంటూ.

* * *

సత్యమూర్తి కొడుకు బర్త్‌డే పార్టీకి వెళ్లి తిరిగి తన ఊరికి డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్న రాజాకు మంజుల పదేపదే గుర్తుకు రాసాగింది. ఆమెను అపురూపంగా చూసుకుంటూ సహకరించవలసిన తను చిన్న విషయాలకు రభస చేస్తూ తూలనాడుతూ వచ్చాడు. తమది కలతల కాపురం కావటానికి కారణం తనే! ఇగోని కంట్రోలులో పెట్టుకొని బ్రతుకులోని బాధ్యతలను పంచుకుంటూ ఉండి ఉంటే తమ సంసారం కూడా సత్యమూర్తి సంసారంలా కళకళలాడుతూ ఉండేది. తనింక ఆలస్యం చేయకుండా తప్పును సరిదిద్దుకోవాలి.

ఆర్నెలలుగా ఎన్నిసార్లు ఫోను చేసినా తన గొంతు వినగానే ఫోను పెట్టేస్తూ వచ్చిన రాజా ఎదురుగా నిలబడేసరికి ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరైంది మంజుల. రాజా మారలేదని, తన కాపురమింక చక్కబడదని, అది తన తల్లిదండ్రులకు గుండెకోత అవుతుందని తల్లడిల్లుతూ వచ్చిన మంజులకు రాజా తనను ఆర్తిగా చేతుల్లోకి తీసుకోవడం ప్లెజంట్ సర్‌ప్రైజ్ అయింది.

"అయాం సారీ మంజూ! ఇంకెప్పుడూ నిన్ను కష్టపెట్టను. తోడునీడగా ఉంటూ అన్ని బాధ్యతలు పంచుకుంటాను. ఇంటికి వెళ్లిపోదాం రా మంజూ!" రాజా మాటలు మధుర సంగీతంలా చెవులకు సోకుతూ ఉండగా నిశ్చింతగా అతని గాఢపరిష్వంగంలో ఒదిగిపోయింది మంజుల.

**-జి.సరస్వతి (బెంగుళూరు)**